కథ

''సుశీల, జయదేవకి మళ్లీ హెల్త్ బాగా లేదట. నేను ఆఫీసు నుంచి రావడం లేటవుతుంది. ప్లీజ్, ఒక్కసారి నువ్వెళ్లి చూస్తావా''

''అయ్యో, మళ్లీ ఏమైంది?''

''నిన్నట్నుంచీ జ్వరమట. షుగర్ కూడా డౌనైనట్టుంది, ఆఫీసు కెళ్దామని తయారైనవాడు స్పృహ తప్పిపోయాడట. మెలకువొచ్చేక నాకు ఫోన్ చేశాడు. లేవ లేకపోతున్నానని, ఇన్ని కిలోమీటర్ల దూరం నుంచి ఆ ట్రాఫిక్ జాముల్ని ఈదుకుంటూ నేనెప్పటికి రాగలను? ఏం చేయాలో తోచని సమయంలో నువ్వే గుర్తు కొచ్చావు. వీలవుతుందా?

# తోడు

కె. వరలక్ష్మి



''అవుతుంది, ఇప్పుడే వెళ్తున్నా''

''థ్యాంకూ'' అభయ్ ఫోన్ కట్ చేసాడు.

బాక్సులో మిగిలిన రెండు చెంచాల అన్నాన్ని గబ గబా నోట్లో కుక్కుకుని, బాక్సు అక్కడ పడేసి లేచింది సుశీల. షాపు మూసేసి, తాళం వేసి గలగలా జయదేవ ఇంటివైపు నడిచింది.

'థ్యాంక్‌గాడ్, మొన్నట్లాగ హార్ట్‌పెయిన్ కాదు'

కాలనీలో ముగ్గురూ తలా ఒక మూల ఉంటు న్నారు. ప్రస్తుతం తను కాలనీ మధ్యలో షాపులో ఉంది కాబట్టి వెంటనే వెళ్లగలుగుతోంది. ఎప్పుడంటే అప్పుడు ఆటోలు దొరకని పరిస్థితి. మెయిన్ రోడ్డుకి వెళ్లడానికి దొరుకుతాయి, కానీ కాలనీలో తిరగడానికి దొరకవు.

ఎండ నడినెత్తిన పడుతోంది. గబగబా పరుగెత్తినట్టే నడుస్తోంది సుశీల.

మొదటి అంతస్తులో ఉంటున్నాడు జయదేవ. మెట్లె క్కేసరికి ఆయసం వచ్చింది. రెండు నిమిషాలు గస పోస్తూ నిల్చుండిపోయింది. 'పెద్దదాన్నైపోయానా...?'

'కాదులే, ఇప్పుడే అన్నం తిని ఎండలో నడిచి వచ్చేను కదా!' తనకి తానే నచ్చ చెప్పుకుంటూ నవ్వు కుంది. 'నలభైకి దగ్గర కావట్లేదూ...'

తలుపు మీద రెండు సార్లు సన్నగా తట్టి, లోపలికి నెట్టింది. తలుపు తెరుచుకుంది.

బెడ్‌రూంలో నిస్త్రాణంగా పడుకుని ఉన్నాడు జయ దేవ. నుదుటి మీద చెయ్యి వేసేసరికి ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.

''నువ్వేంటి...నువ్వెలా వచ్చేవ్...''

''కంగారుపడక, అభయ్ చెప్పేడు, అవునూ ఇంత జ్వరం తో ఉండి ఎక్కడో ఉన్న అభయ్‌కా ఫోన్ చేస్తావు?''

''అది కాదూ...''

''ఏది కాదు? నాకు తెలుసులే నీ సంగతి, మాట్లాడకు''

నీరసంగా చూస్తూ నవ్వేడు. ''ఎన్ని సార్లిలా వచ్చి దేవ తలా ఆదుకుంటావు? ఏడాదిగా నీకిదే పనైపోయింది.''

మంచం పక్కన టీపాయ్ మీద తింటూ వదిలేసిన ఇడ్లీప్లేటు తీసి సింకులో పడేసి వచ్చింది.

పవరు కట్టైనట్టుంది...ఫేన్ తిరగడం లేదు.

ఇప్పుడిప్పుడే పల్చబడుతున్న జుట్టు చెమటకు తడిచి నుదిటికి అంటుకుపోయింది. కళ్లు లోపలికిపోయి పది లంఖణాలు చేసిన వాడిలా ఉన్నాడు. ఆఫీసుకి వెళ్దామని రెడీ అయినట్టున్నాడు. ఇస్త్రీ బట్టలు వేసుకుని ఉన్నాడు.

ఒక్క నిమిషం అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీల నగా చూసి, వంటింట్లోకెళ్లింది సుశీల.

పనిమనిషి రాలేదల్లే ఉంది. రాత్రి తిన్న కంచం సింకులో అలాగే ఉంది.

ఫ్రిజ్‌లోంచి బ్రెడ్ తీసి పెనం మీద కాల్చి, గ్లాసు నిండా కాఫీ కలిపి పట్టుకెళ్లింది.

లేవబోతే వారించి, పక్కనే కూర్చుని బ్రెడ్‌ని కాఫీలో ముంచి తినిపించింది.

కృతజ్ఞతగా చూస్తున్న అతని కళ్లల్లో నీళ్లు చిప్పిల్లడం గమనించనట్టే చూపులు తిప్పుకొంది.

''నువ్వు కూడా కాఫీ తెచ్చుకోరాదూ''

''నేనిప్పుడే అన్నం తిన్నాను. టేబ్లెట్స్‌మైనా వేసుకోవాలా?''

''అవును''

ఎక్కడున్నాయో అడిగి తీసి ఇచ్చింది. కొంచెం ఓపిక వచ్చినట్టుంది, తనే లేచి కూర్చున్నాడు.

''థ్యాంక్స్''

''దేనికి''

''ఏమో....'' కళ్లతోనే నవ్వేడు.

''అవును, ఏమిటి దంతా?''

''ఏదంతా?''

''ఈ ఒంటరి జీవితం''!!

అతను దీర్ఘంగా నిట్టూర్చి ''ఆమె రాదు'' అన్నాడు.

''అదే ఎందుకని?''

''ఏమో....'' ఈ సారి కళ్లల్లో నిర్లిప్తత.

ఒక్కసారిగా కళ్లల్లోకి మెరుపుతెచ్చుకుని ''నువ్విక్క డుండిపోరాదూ'' అన్నాడు.

''నీకు వండిపెట్టడా నికా?'' ఆమె గొంతులో హాస్యాన్ని గమనించి కూడా ''ఛా'' అన్నాడు.

''సుశీ, నువ్వంటే నాకు చాలా ఇష్టం'' ఆమె అర చేతిని అందుకుని నుదు

టికి తాకించుకున్నాడు.

''దీన్నే జ్వర ప్రేలాపన అంటారు'' నవ్విందామె.

''నిజం''

''నిజం లేదు...అబద్ధం లేదు, నిద్ర పోయాక, అభయ్ ఫోన్ చేస్తే ఏమైపో యోవోనని....''

''ఏమైనా అయిపోతే ఉంటావా?''

అరచేత్తో అతని నోటిని మూసి ''మాట్లాడకు'' కోపంగా చూసింది.

''ఇంకోసారి కాఫీ ఇవ్వనా''

''వద్దు'' మొహం అయిష్టంగా పెట్టేడు.

నుదిటి మీద చెయ్యి వేసి చూసి ''ఇంకా జ్వరం ఉంది'' అంది. '' రోజూ తాగుతున్నావా'' సూటిగా అతని కళ్ల ల్లోకి చూసింది.

అతను చూపులు తిప్పుకొంటూ ''లేదే...'' అని తడబడ్డాడు. ''నేను చూసేను, వంటింటి రేక్‌లో సీపాల వెనక సిగ్నిచర్.....'


''ఓ అదా...ఒక ఫ్రెండు....''

''అబద్ధాలాడకు'' కోపంగా మాట్లా డాలనుకున్న గొంతులోకి జాలి ప్రవేశిం చింది. ''షుగర్ పేషంట్లు తాగితే ఏమౌ తుందో తెలుసా, మా నాన్నలాగే అవు తుంది'' జయదేవ కిటీలోంచి దూరంగా కనిపిస్తున్న ఆకాశాన్ని చూస్తున్నాడు.

సుశీల లేచి అరగంటలో ఇల్లంతా చక్కబెట్టి వచ్చింది. జ్వరం దిగినట్టుంది,చె మటలు కారుతున్న నుదిటి మీద చెయ్యి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

కరెంట్ వచ్చి ఫేన్ తిరగడం మొదలు పెట్టింది.

'సాయంకాలం తొందరగా షాపు మూసేసి వస్తాను' అని చీటీ రాసి స్టూలు మీది నీళ్ళ జగ్గు కింద పెట్టి



చప్పుడు కాకుండా తలుపు మూసి కిందికి నడిచింది సుశీల.

షాపులో కూర్చున్న సుశీల మనసు గతంలోకి పరుగులు తీసింది.

సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం రాష్ట్రానికి తలోమూల నుంచీ తనూ, జయదేవ, అభయ్, డిప్లొమాలు పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో కలలు నింపుకున్న కళ్లతో రాజధానికి వచ్చేరు. మొదట్లో చాలా ధీమాతో, చిన్న చిన్న ఉద్యోగాల్ని నిర్లక్ష్యంగా నిరాకరించేసి, తర్వాత క్రమంగా ధైర్యం జారిపోయి ఒక కెమికల్స్ ఫేక్టరీలో డైలీవేజ్‌కి జాయిన్‌కావడం, అక్కడే తమ ముగ్గురికీ పరిచయం, ఆ పరిచయం స్నేహంగా మారడం, ఉదయం, సాయంకాలం చెప్పుకునే కబుర్లు చాలక ఫేక్టరీలో కేప్స్యూల్స్‌లో పౌడర్ నింపుతూ నోటినీ ముక్కునీ మూసేసి యాప్రాన్‌ల లోంచి కళ్లతోనే మాట్లాడుకోవడం, నవ్వుకోవడం....

తర్వాత క్రమంగా ఎక్కడ కొంచెం సేలరీ ఎక్కువనిచ్చే ఆపర్చ్యునిటీ ఉందో వెతుక్కుని వెళ్లి జాయినై పోవడం, అలా నాలుగేళ్ల తర్వాత చేరిన ఫేక్టరీలో కొంత స్థిమితంగా కుదురుకున్నారు.

వాళ్లు నిర్మించి ఇస్తున్న ఈ కాలనీలో లోన్‌ల మీద ఇళ్లు సంపాదించుకున్నారు. ఆ ఫేక్టరీ మూతపడినపుడు పి.ఎఫ్‌తో సహా దాచుకున్న డబ్బులన్నీ లోన్స్‌కి పోయి అందరూ రోడ్డున పడడం....అంతా కళ్ల ముందుకొచ్చింది.

తనకున్న ఏకైక బంధువు తన తండ్రి మొదట్నుంచీ తనతోనే ఉన్నాడు. దొరికిన పనేదో చేసి నాలుగు డబ్బులు సంపాదించేవాడు. అతనికున్న తాగుడు అలవాటుకి ఆ డబ్బుల్ని ఖర్చుపెట్టుకునేవాడు. తాగి ఇంటికొచ్చి అన్నం తింటూ రోజూ ''నువ్వు మా అమ్మవి...అందుకే నాకీ వయసులో అన్నం పెడుతున్నావు....'' అని కళ్ల నీళ్లు పెట్టుకునేవాడు. 'ఇందాక జ్వర తీవ్రతతో జయదేవ ఎలాగ' అనుకుంటే, సుశీల పెదవుల మీదికి బాధతో కూడిన చిరునవ్వొకటి పాకి వచ్చింది.

సిటీకి వచ్చే సరికి జయదేవకి పెళ్లైంది. నిలదొక్కుకునే వరకూ అతను అప్పుడప్పుడు వాళ్ల ఊరికి వెళ్లొస్తూండేవాడు. జయదేవ భార్య దేవకి చంటిపిల్లాడినెత్తుకుని మొదటిసారి సిటీకి కాపురానికి వచ్చింది.

పిల్లవాడికి ఏడెనిమిదేళ్ల వయసున్నప్పుడు వాణ్ణి తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. 'పిల్లాడి చదువు' అని చెప్పేవాడు జయదేవ. అతను ఎప్పట్లాగే వాళ్ల ఊరికి వెళ్లొస్తావుంటే అంతా సవ్యంగానే ఉంది అనుకునే వాళ్లు తనూ, అభయ్.

ఈమధ్య జయదేవకి ఆరోగ్యం బాగాలేనప్పుడు కూడా ఆమె రాకపోయేసరికి అసలు నిజం తెలిసింది. ఏవో కలతల కారణంగా ఆమె జయదేవ నుంచి విడిపోయి వెళ్లిపోయిందని, ఇక అభయ్ విషయానికొస్తే- కారణం తెలీదుగాని అతను పెళ్లి చేసుకోలేదు. గోదావరి జిల్లా నుంచి వచ్చేడు. అతనిది పెద్ద కుటుంబం. ఇక్కడే ముగ్గురు చెల్లెళ్ల పెళ్లిళ్లు చేసేడు. ఒక తమ్ముణ్ణి చదివించి ఉద్యోగంలో కుదురుకునేలా చేసేడు. అభయ్‌తో బాటు అతని తల్లిదండ్రులు ఉంటారు. ఈమధ్య వాళ్లింటికెళ్లినపుడు అభయ్ తల్లి ''సుశీలమ్మా, కుసింత నువ్వైనా చెప్పమ్మా, ఆడలాగ పెళ్లీపెటాకులూ లేకుండా ఎంతకాలం ఉంటాడు? ఏటెల్లకాలం మేవుంటామా, ఆడి మంచీచెడ్డా చూసుకునీవోళ్లుండొద్దా'' అని కళ్లనీళ్లు పెట్టుకుంది.

'అతనికి తల్లి ఉంది కాబట్టి అతని కోసం తాపత్రపడుతోంది, నాకెవరున్నారు?' అనుకుంది సుశీల.

తన తండ్రి జబ్బుతో ప్రాణం మీదికి తెచ్చుకుంటే ఉన్న ఇంటిని అయినకాడికి అమ్మేసి వైద్యం చేయించాల్సొచ్చింది. చివరికి ఇల్లూ దక్కలేదు, తండ్రీ దక్కలేదు.

ఫేక్టరీ మూత పడ్డాక వాళ్లిద్దరూ ఏవో పాట్లు పడి వేరే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. తండ్రి అనారోగ్యం కారణంగా తను ఇంట్లోనే చిక్కుపడిపోయింది. కాలనీలోనే చిన్న బట్టలషాపు పెట్టుకుని అటు తండ్రినీ, ఇటు షాపునీ చూసుకుంటూ నెట్టుకొచ్చింది. తండ్రి పోయాక గొప్ప రిలీఫ్‌తో బాటు భరించలేని ఒంటరితనం తనని చుట్టుముట్టింది.

ఈమధ్య ఉన్నట్టుండి కాలనీకి ఒక బూమ్ వచ్చింది. హఠాత్తుగా ఇళ్ళ స్థలాల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఎక్కడెక్కడినుంచో బిల్డర్స్ వచ్చి గుడ్‌విల్ సొమ్ముతో బాటు, ఫ్లాట్స్ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుని, ఇళ్లన్నీ పడగొట్టేసి బహుళ అంతస్తుల బిల్డింగ్స్ నిర్మిస్తున్నారు. ఆ స్కీము ప్రారంభమైన కొత్తలోనే జయదేవ తన ఇంటిని డెవలప్‌మెంటుకి ఇచ్చేసాడు. ఇప్పుడు తాను మూడు ఫ్లాట్స్‌కీ, పది లక్షలకీ యజమాని.

ఇక తన విషయానికొస్తే, వచ్చే నెలకంతా షాపుని ఖాళీ చెయ్యాలని చెప్పేడు ఓనరు. ఎక్కడా షాపు దొరికే అవకాశం లేదు. ఏం చేయాలో తోచడం లేదు.

ఎటు చూసినా పడిపోతున్న కాలనీ ఇళ్లు, పైకి లేస్తున్న అంతస్తుల భవనాలు. రోడ్లన్నీ దుమ్ము,ధూళి సిమెంట్ మయం. ఒకప్పుడు పరిశుభ్రతతో, పచ్చదనంతో మొదటి స్థానాన్ని పొంది, ఏళ్ల తరబడి బెస్ట్ కాలనీగా బహుమతులు అందుకున్న కాలనీ అనూహ్యంగా ఇప్పుడు తనలాంటి వాళ్లకి కన్నీళ్లు తెప్పిస్తోంది. మూడువైపులా రాళ్లగుట్టలు, ఒకవైపు చెరువు, మధ్యలో అందమైన పల్లెలాగ విలసిల్లిన కాలనీ ఇప్పుడు కాంక్రీటు వనమైపోయింది.

సాయంకాలం షాపు మూసి వెళ్లేసరికి జయదేవ ఇంటికి అభయ్ వచ్చి ఉన్నాడు.

కొత్తగా ఓ పెద్దాయన, పదిహేడు-పద్దెనిమిదేళ్ల ఓ అబ్బాయి హాల్లో కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. అబ్బాయి ఎందుకో ముఖం గంటుపెట్టుకుని, తలదించుకుని ఉన్నాడు.

జయదేవ ఇంట్లో వేసుకునే బట్టల్లో వాళ్ళ ముందు సోఫా మీద వెనక్కి చేరబడి కూచుని ఉన్నాడు. చాలా సేపట్నుంచి ఏదో చర్చ వాళ్ల మధ్య సీరియస్‌గా సాగుతున్నట్టుంది.

'వీళ్లిద్దర్నీ ఎక్కడో చూసినట్టుందే' అనుకుంది సుశీల.

''రా సుశీల'' అని జయదేవ పక్కకి జరిగి సోఫాలో చోటిచ్చాడు.

'సుశీల' అన్న పేరు విని అబ్బాయి చటుక్కున తలపైకెత్తి చూసాడు.

'' సుశీల! గుర్తుందా...జయదేవ మామగారు, కొడుకు'' అన్నాడు అభయ్

సుశీలపెద్దాయనకు నమస్కరించి, వంగి పిల్లాడి చెయ్యి అందుకోబోయింది. వాడు ముందే పసికట్టినట్టు చేతిని చురుగ్గా వెనక్కి లాక్కున్నాడు. వాడి చూపులకే గనక శక్తి ఉంటే సుశీల భస్మమైపోయేదే.

సుశీల ఆశ్చర్యంగా అభయ్‌వైపు చూసింది.

అభయ్ ఆ విషయాన్ని మరిపించడానికన్నట్టు గబగబా మాట్లాడడం మొదలుపెట్టేడు. ''సుశీల, వీడికిక్కడ ఇంజనీరింగ్ కాలేజ్‌లో సీటొచ్చిందట తెల్సా! జయదేవకి వారసుడు వీడే కదా! త్వరలోనే దేవకిగారు కూడా వచ్చేస్తారట. జయదేవ హెల్త్ గురించి మనం ఇంక వర్రీ కానక్కర్లేదు. ఇకపై అంతా ఓకే, ముగ్గురూ కలిసే ఉంటారు''

''ఏడాది క్రితం నుంచీ జయదేవ సిక్కవుతూనే ఉన్నాడు. అభయ్ ఫోన్ చేస్తూనే ఉన్నాడు. ఇప్పటికి ఆమె మనసు కరిగిందా? హఠాత్తుగా వచ్చిన సంపద ఆమె మనసును మార్చిందా?'' సుశీల ఆలోచించబోయి మానుకుంది.

జయదేవ రెప్పవాల్చకుండా తదేకంగా కొడుకునే మురిపెంగా చూసుకుంటున్నాడు.

సుశీల నవ్వుతూ వాడివైపు చూసి ''బాబీ, చూసేవా, మీ నాన్నకి నువ్వంటే ఎంతిష్టమో! ఈ మధ్యంతా తనకి హెల్త్ బావుండడం లేదు, అమ్మని త్వరగా రమ్మని చెప్పు'' అంది.

వాడు గోడకి కొట్టిన బంతిలా సమాధానమిచ్చేడు. ''దటీజ్ నన్నాఫ్ యువర్ బిజినెస్, ఇప్పటికైనా నువ్వొదిలేస్తే మా అమ్మ ఇక్కడే ఉంటుంది'' ఒక్క క్షణం సుశీలకి ఏం విన్నదో అర్థం కాలేదు. అర్థమయ్యాక ముఖంలో నెత్తురింకిపోయినట్లైపోయింది.

జయదేవ ఏదో చెప్పబోయి ఆగి తలపట్టుక్కూర్చున్నాడు.

అభయ్ అదాటున లేచి సుశీల చెయ్యందుకున్నాడు. ''సుశీల, మీ షాపు ఓనరు అర్జంటుగా ఏదో మాట్లాడాలన్నాడు. పద వెళ్దాం'' ఇంచుమించు సుశీలను చెయ్యి పట్టుకుని లాక్కుంటూ కిందికి తీసుకొచ్చేడు. దుఖంతో వివశ అయిపోయింది సుశీల.

''అవునా అభయ్, మన స్నేహం అలాంటిదా?'' అంది.

వీధి దీపం క్రీనీడలో ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి ఆప్యాయత నిండిన గొంతుతో ''సుశీల, నన్ను పెళ్లి చేసుకుంటావా?'' అనబోయిన అభయ్ ఆ మాటతో ఆగిపోయాడు.

*

